క్లుప్తంగా

బడ్జెట్ సమావేశం రేపు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి ఆదివారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2024–25కు సంబంధించి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని ఎంపీటీసీలంతా హాజరుకావాలని కోరారు.

వైభవంగా గాయత్రీ యజ్ఞం



గాయత్రీ యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భామిని: మండలంలోని పసుకుడి రామమందిరం ప్రాంగణంలో ఆదివారం హరిద్వార్ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. తొమ్మిది కుండలీలలో హోమాదికాలు, జపాలు చేశారు. స్థానిక గాయత్రీ పరివార్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, నేరడి–బి, సొలికిరి, పెద్దదిమిలి, నులకజోడు సత్యసేవా సంఘాల సభ్యులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పసుకుడి గ్రామంలో అన్న సంతర్పణ చేశారు.

ముమ్మరంగా పంటకోత ప్రయోగాలు



కొండాపురంలో పంటకోత ప్రయోగం

పాలకొండ: మండలంలో పంటకోత ప్రయోగాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముందుగా ఎంపిక చేసిన పొలాల్లో వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఇన్సూరెన్స్ సిబ్బంది పంటకోత చేపట్టి దిగుబడి అంచనా వేస్తున్నారు. ప్రాంతాల వారీగా దిగుబడులు గుర్తించి నివేదికలు రూపొందిస్తున్నారు. పంటకోత ప్రయోగాల ఆధారంగా పంటబీమా వర్తిస్తుంది.

30న ఉచిత మెగా వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో ఈనెల 30న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ బి.మహేశ్వరరావు ఆదివారం తెలిపారు. శ్రీసత్యసాయి బాబా మందిరం ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయనున్నట్లు ఏరియా మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, పీఆర్వో ఎ.రాజు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రేగిడి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు సూచించారు. ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎంతోమంది మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, పొగాకు వంటి మత్తు పదార్థాలకు బానిసలై, జీవితం నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదకద్రవ్యాలు(గంజాయి, కొకైన్, హెరాయిన్..) అమ్మడం, కొనడం రెండూ నేరమేనని, వాటిని విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాజాం: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం నిర్వహించారు. సమాఖ్య మండల అధ్యక్షురాలిగా సామంతుల అరుణకుమారి, ఉపాధ్యక్షురాలిగా పొగిరి వెంకటరమణమ్మ, కార్యదర్శిగా ఎ.గౌరీశ్వరి, సహాయకార్యదర్శిగా ఎ.మంగమ్మ, కోశాధికారిగా ఎ.రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలోని మహిళా సంఘాల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తామని, ఆర్థిక అక్షరాస్యత పెంచుతామని కొత్త కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, ఏపీఎం దధికుమార్, ఎఫ్‌పీవో ఏపీఎం కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మునిస్వామి

తెర్లాం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల అధ్యక్షుడిగా గర్బాపు మునిస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా చిప్పాడ రమణ, సహాధ్యక్షుడిగా బి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా శంకరరావు, కోశాధికారిగా రాంబాబు ఎన్నికయ్యారు.



వీరఘట్టం: చిట్టపులివలసలో త్రివర్ణపతాకం, అంబేడ్కర్ చిత్రపటంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



పాలకొండ రూరల్: భాసూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



సీతంపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజాస్వామ్యానికి పునాది రాజ్యాంగం

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం పునాది. 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించింది. రాజ్యాంగ విలువల పట్ల పౌరుల్లో గౌరవ భావాన్ని పెంపొందించేందుకు ఏటా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇందులో భాగంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

పాలకొండ రూరల్: యావత్తు జాతి గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని భాసూరు గ్రామంలో సర్పంచ్ ఎస్.మల్లేశ్వరమ్మతో కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. భావితరాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ఆ నాడు అంబేడక్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని, దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, గురువినాయుడు, లైన పకీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- **కురుపాం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం టి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.సత్యనారాయ పాల్గొని రాజ్యాంగ నిర్మాతలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ వారి పాలనలో అస్తవ్యస్తమైన మన దేశాన్ని ఏకతాటిపై నడిపించడంలో రాజ్యాంగం కీలకపాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆలకు జగదీశ్వరరావు, సంతోష్‌కుమార్ పండా, విద్యార్థులు పాల్గొన్నారు.
- **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయం ఆవరణలో రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ ఆవశ్యకతను, ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాఖాగ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కురుపాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

- **భామిని:** మండలంలోని బాలేరులో జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, కార్యదర్శి సత్యవతి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భామిని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి ఉన్న విశిష్టతను వివరించారు. బత్తిలి సచివాలయంలో డబ్ల్యూఏ గంగారావు నేతృత్వంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.
- **పాలకొండ:** పట్టణంలోని ఎలాం సెంటరులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశానికి అందించారన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించి అందులో సూచించిన విధంగా మనమంతా బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాలవలస దవళేశ్వరరావు, కిల్లారి మోహన్, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.
- **సీతంపేట:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- **వీరఘట్టం:** మండలంలోని చిట్టపులివలసలో ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. వీరఘట్టం పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో, కంబరవలస హైస్కూల్‌లో హెచ్‌ఎం వై.లక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయుడు ఎ.వెంకటరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో పాలన..



పాలకొండ రూరల్: మహోన్నత ఆశయంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించే దిశగా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నేతలు రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి కుటిల రాజకీయ పార్టీలు, నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా హితం కోరే జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు.



భామిని: బాలేరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాలకొండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వీరఘట్టం: కంబరవలస పాఠశాల వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



భామిని: మోడల్ స్కూల్‌లో సోషల్ టీచర్లను సన్మానిస్తున్న విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలలో మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. పార్లమెంట్ కార్యకలాపాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పార్లమెంట్ సభ్యుల మాదిరిగా పలు అంశాలపై చర్చించారు. హెచ్‌ఎం లిల్లీరాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా వికసిత్ భారత్ సంకల్పయాత్ర

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము, దేరువాడ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, గిరిజనులకు కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఉజ్వల, పీఎం ఆవాస్ యోజన, ఆహార భద్రత, సంపూర్ణ పోషకాహారం, జల్‌జీవన్, ఆయుష్మాన్ భారత్, పీఎం జన ఆరోగ్య యోజన, గరీబ్ కల్యాణ్ అన్న యోజన, దీనదయాళ్ అంత్యోదయ యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్ సమ్మాన్, పోషణ అభియాన్, జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి యోజన, తదిరర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లను సన్మానించారు.



గుమ్మలక్ష్మీపురం: దేరువాడలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సతివాడలో..

భామిని: మండలంలోని సతివాడ, పోలీస్ కోటలో ఆదివారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి వల్ల గిరిజనులకు కలిగే లబ్ధిని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఈఓపీఆర్డీ కృష్ణారావు, సర్పంచ్‌లు పాశర్ల రామారావు, బిడ్డిక నారాయణ, తదితరులు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా బాలేరు వైద్యాధికారి డాక్టర్ దీపికా రాణి నేతృత్వంలో వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యదర్శి భవానీ శంకర్, వీఆర్‌ఓ వినోద్‌కుమార్, రాజేష్ పట్నాయిక్, బీజేపీ మండల అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



పాలకొండ రూరల్: కాశీవిశ్వనాథుని ఆలయంలో కార్తీక పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. అరటి దవ్వలపై దీపాలు వెలిగించి నాగావళి నదిలో విడిచిపెట్టారు. స్థానిక కాశీవిశ్వనాథుని ఆలయలంలో సామూహిక దీపారాధన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భామిని: మండలంలో నేరడి–బి, బత్తిలి, సింగిడి, బాలేరు, పెద్దదిమిలి, భామిని, పసుకుడి, నులకజోడు గ్రామాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వరిదుబ్బులు, చెరుకు గడలు, దక్షిణ పుల్లలు, మర్రి ఊడలను పీఠంపై ఉంచి పండ్లు, బూరెలను నైవేద్యంగా పెట్టి కేదారీశ్వరునికి పూజలు చేశారు. అనంతరం పౌర్ణమి చంద్రుడిని దర్శించి ఉపవాసాలు విరమించారు.

మన్యంలో పిక్నిక్‌ల సందడి

- ఆకట్టుకుంటున్న ఏజెన్సీ అందాలు
- అడ్వంచర్ పార్కు, జలపాతాలు, వ్యూ పాయింట్లకు పర్యాటకుల తాకిడి

సీతంపేట:

మన్యంలో వనభోజనాల సందడి ప్రారంభమైంది. ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. మెట్టుగూడ, సున్నపుగెడ్డ జలపాతాలకు, ఐటీడీఏ అడ్వెంచర్ పార్కుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలు చేసి సందడి చేస్తారు. అడ్వెంచర్ పార్కులోని జలవిహార్‌లో బోటుషికారు చేయవచ్చు. పిల్లల కోసం సైక్లింగ్, షూటింగ్, టాయ్ ట్రైన్, ఇతర సాహస క్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఆడలి, పొల్ల, జగతపల్లి వ్యూపాయింట్ల నుంచి మన్యం అందాలను చూస్తూ ఆస్వాదించవచ్చు.

ఇలా చేరుకోవాలి..

సీతంపేట నుంచి కొత్తూరుకు వెళ్లే రహదారి మధ్య సీతంపేటకు మూడు కిలో మీటర్లు దూరంలో ఉంది. ఇక్కడ పగోడాలు, పర్యాటకుల కోసం వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేశారు. అలాగే దోనుబాయి గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో సున్నపుగెడ్డ జలపాతం ఉంది. మేకవ గ్రామానికి సమీపంలో రోడ్డుదిగువన నడుచుకుంటూ రెండు కిలోమీటర్లు వెళ్లే సున్నపుగెడ్డను చేరుకోవచ్చు. అలాగే చంద్రమ్మగుడి కూడా పిక్నిక్ స్పాట్‌గా పేరుంది. ఆడలి, పొల్ల, జగతపల్లి వ్యూపాయింట్‌లు కూడా చూడవచ్చు. సున్నపుగెడ్డ నుంచి కొద్ది దూరంలోనే పొల్ల వ్యూపాయింట్ ఉంది. అలాగే సీతంపేట నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో జగతపల్లి వ్యూపాయింట్ ఉంది. ఇది కూడా చూడడానికి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. పాలకొండ నుంచి సీతంపేట వస్తుంటే మధ్యలో శంబాం రహదారి ఉంటుంది. శంబాం నుంచి ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లాల్సి ఉంటుంది.



ఆడలి వ్యూ పాయింట్



అడ్వంచర్ పార్కులోని జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు



మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

అప్రమత్తంగా ఉండాలి



పిక్నిక్‌కు వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి. ఘాట్‌రోడ్‌లో వాహనాల్లో ప్రయాణించేటపుడు జాగ్రత్తగా ఉండాలి. మద్యం సేవించి ఆయా ప్రాంతాల వైపు వెళ్లొద్దు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. పర్యటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– జీవీ కృష్ణారావు, పాలకొండ డీఎస్పీ

వసతులు కల్పించాం..



సీతంపేటలో ఎక్కువగా ఆకట్టుకునే ప్రదేశాలు ఉండడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళ్తుంటారు. ఏజెన్సీలో ఉన్న జలపాతాలు, పర్యాటక ప్రదేశాల్లో సందర్శకులకు అవసరమైన వసతులు కల్పించడం జరిగింది.

– నారాయణరావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి

వృద్ధుడికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన వృద్ధుడు ముంజేటి రాజారావు గాయపడ్డాడు. ఆదివారం వేకువజామున రాజారావు బహిర్భూమికి వెళ్లేందుకు సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపక్క తుప్పల్లో పడిపోయాడు. ఉదయం అటుగా వెళ్లినవారు చూసి రాజాం సామాజిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి..

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని వస్త్రపురికాలనీ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలయ్యాని ఎస్సై పి.నీలావతి తెలిపారు. కంచరాం గ్రామం నుంచి రాజాం వస్తున్న ఆటో మితిమీరిన వేగంతో వచ్చి అదుపు తప్పి బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కోండ్రు రామలక్ష్మి, బండి అప్పలరాజు, వాస నందకుమార్‌లు స్వల్పగాయాలపాలయ్యారని, వారిని స్థానికులు రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.